అల్లు అర్జున్ అరెస్టు హేయనీయం: ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్13: దేశవ్యాప్తంగా పేరుగాంచిన సినీహీరో అల్లు అర్జున్‌ను ఒక క్రిమినల్‌లా ఇంట్లోని బెడ్రూం వద్దకు వెళ్లి అరెస్ట్ చేయడం హేయమైన చర్య హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక వీడియో సందేశం విడుదల చేశారు. పుష్ప 2 సినిమా విడుదల రోజు థియేటర్ల వద్ద రద్దీ విపరీతంగా ఉంటుందని ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. ఈ క్రమంలో జరిగిన ఘటనకు బాధ్యుడిగా అల్లు అర్జున్‌ను కాదు, రేవంత్‌రెడ్డిని అరెస్టు చేయాలన్నారు. ఎవరిని పడితే వారిని చట్టవిరుద్ధంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఈ ప్రభుత్వం శాశ్వతం కాదని రేవంత్‌రెడ్డి గుర్తుపెట్టుకోవాలన్నారు. రేపు మీకు ఇదే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ప్రజలు, అభిమానుల మనోభావాలు గౌరవించడం నేర్చుకోవాలని హితవుపలికారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలి



రిలే దీక్షలో పాల్గొన్న మాజీ సర్పంచులు

కలెక్టరేట్, డిసెంబర్ 13 : పెండింగ్ బిల్లుల విడుదలపై ఎన్నికలకు ముందు తమకు ఇచ్చిన హామీ వెంటనే అమలు చేయాలని మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు అక్కనపల్లి కరుణాకర్ డిమాండ్ చేశారు. మాజీ సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో కొనసాగుతున్న దీక్షలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా అప్పులు తెచ్చి చేసిన పనుల బిల్లులు సత్వరమే విడుదల చేయాలన్నారు. ఎన్నికలకు ముందు ఓమాట గెలిచిన అనంతరం మరోమాట అన్నట్లుగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరించడం సముచితం కాదన్నారు. మాజీ సర్పంచుల కుటుంబాల జీవితాలతో చెలగాటమాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. వెంటనే బిల్లులు చెల్లించకపోతే రాబోయే రోజుల్లో ఉధృతమయ్యే ఉద్యమంలో ప్రభుత్వం బలికాక తప్పదని స్పష్టం చేశారు. ఐదోరోజు కొనసాగిన నిరవధిక దీక్షలో తాజా మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, జిల్లా అధ్యక్షుడు జోగు లక్ష్మీరాజు, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల అధ్యక్షులు దుమ్మ అంజయ్య, కనవేని శ్రీనివాస్, ఎండీ నజీర్‌హుస్సేన్, వడ్నూరి ఆదిమల్లు, సమ్మయ్య, ఆకుల శంకర్, మల్లేశంతో పాటు పలుపురు పాల్గొన్నారు.

ఎదుగుదలకు పౌష్టికాహారం ముఖ్యం

పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు

గన్నేరువరం, డిసెంబర్13: పిల్లల ఎదుగుదల, బరువు పెరుగడానికి పౌష్టికాహారం ఎంతో అవసరమని ఐసీడీఎస్ సీడీపీవో శ్రీమతి అన్నారు. మండలంలోని పారువెల్ల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభలో పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతం, పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రామానుజాచార్యులు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఇస్రత్ సుల్తానా, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ ప్రణీత, ఏఎన్ఎం భూలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

పైవేటుకు ధీటుగా అంగన్‌వాడీల్లో బోధన

- పీహెచ్‌సీలలో ఆరోగ్య మహిళా ద్వారా ఉచితంగా 54 రకాల వైద్య పరీక్షలు
- శుక్రవారం సభలో కలెక్టర్ పమేలా సత్పతి

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్/విద్యానగర్, డిసెంబర్ 13: పైవేటుకు ధీటుగా బోధన చేస్తున్న అంగన్‌వాడీల్లో తమ పిల్లలను చేర్చి, చిన్నారుల సంక్షేమంపై దృష్టి సారించాలని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. నగరంలోని లక్ష్మీనగర్‌లో గల కేఈఎస్ గార్డెన్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో చిన్నారులు, మహిళలు పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటుండగా, వారికి సమతుల ఆహారం అంగన్‌వాడీల్లో అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లతో కూడిన ఆహారం విధిగా తీసుకోవాలని సూచించారు. అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య మహిళా కార్యక్రమంపై వైద్యాధికారులు దృష్టి సారించాలన్నారు. కేంద్రం పరిధిలో గల మహిళలందరికీ వైద్య పరీక్షలు పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా రూ.50వేల ఖరీదు చేసే 54 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ మాట్లాడుతూ, మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు అంగన్‌వాడీ చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి సబిత, అదనపు డీఎంహెచ్‌వో సాజిదా, కార్పొరేటర్ స్వప్న, డీసీపీవో పర్వీన్, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ సంపత్, సఖీ అడ్మిన్ లక్ష్మి పాల్గొన్నారు.

ట్రినిటీ రామానుజన్ ఒలింపియాడ్ టెస్ట్-2024 పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న మనోహర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 13 : జిల్లా కేంద్రంలో ఈ నెల 22న ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస్ రామానుజన్ జన్మదినం సందర్భంగా ట్రినిటీ జూనియర్ కళాశాలు కరీంనగర్, పెద్దపల్లి ఆధ్వర్యంలో కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో గల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రామానుజన్ ఒలింపియాడ్ టెస్ట్-2024 నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు లెవల్ -2 పరీక్ష పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాళ్లతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎస్ఎస్ఎస్ విద్యార్థులకు ఈ నెల 10 నుంచి 18వ తేదీ వరకు లెవెల్-1 పరీక్షను వారివారి పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈ నెల 22న రామానుజన్ జయంతి సందర్భంగా లెవల్-2 పరీక్ష కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ట్రినిటీ ప్రైమ్ క్యాంపస్, ఏసీ బాయ్స్ క్యాంపస్, ఏసీ గర్ల్స్ క్యాంపస్‌లో నిర్వహిస్తామని చెప్పారు. లెవెల్-2 పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈ నెల 25న ట్రినిటీ ప్రైమ్ క్యాంపస్‌లో బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. ఇందులో మొదటి బహుమతి మొదటి బహుమతి రూ. 10 వేలు, రెండో బహుమతి రూ. 7,500, మూడో బహుమతి రూ. 5 వేలు, నాలుగో బహుమతి రూ. 3వేలు, ఐదో బహుమతి రూ. 2వేలు, 6 నుంచి 10 ర్యాంకులు పొందిన వారికి రూ. 1500, 20 మంది విద్యార్థులకు వెయ్యి రూపాయల చొప్పున ప్రోత్సాహక బహుమతి ఇస్తామని చెప్పారు. దీంతో పాటు లెవల్-2 పరీక్షల్లో 80 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాలలో 10 శాతం నుంచి 100 శాతం వరకు ఫీజులో రాయితీ ఇస్తామని వెల్లడించారు.

పాఠశాలకు ఆర్‌వో ప్లాంట్ వితరణ

చొప్పదండి, డిసెంబర్13: పట్టణంలోని ఇప్పనపల్లి హరికిషన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పట్టణానికి చెందిన సిరిపురం రమ- రాజేందర్ దంపతుల కుమారుడు రామ్మూర్తి రూ.60వేల విలువగల ఆర్‌వో ప్లాంటు వితరణ చేశారు. పాఠశాలకు ఆర్‌వో ప్లాంట్ సమకూర్చిన రామ్మూర్తికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైద్యుల రాజిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

కొండపాక సబ్‌సెంటర్‌ను సందర్శించిన కేంద్రబృందం

వీణవంక, డిసెంబర్ 13: వీణవంక పీహెచ్‌సీ పరిధిలోని కొండపాక సబ్‌సెంటర్‌ను కేంద్రవైద్య బృందం సందర్శించింది. కేంద్ర ఎన్‌క్వాస్ (ఎన్‌క్యూయూఏఎస్) బృందం సభ్యులు డా.శమాబానో, ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీ డా.భరత్‌కుమార్ కొండపాక సబ్‌సెంటర్‌లో వైద్య సదుపాయాలను, ఓపీ, ఫార్మసీ, ల్యాబ్, గ్రీనరీ, తదితర అంశాలను పరిశీలించి, రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. అంతకు ముందు హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు కేంద్ర వైద్యబృందానికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో వీణవంక పీహెచ్‌సీ డా.వరుణ, పీవో ఎంసీహెచ్ సనాజవేరియా, క్వాలిటీ మేనేజర్ సాగర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేశ ప్రధాన సవాళ్లలో నిరుద్యోగం మొదటిది

- గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ బీఎన్‌రావు

మాట్లాడుతున్న డాక్టర్ బీఎన్‌రావు

విద్యానగర్, డిసెంబర్ 13 : నిరుద్యోగ సమస్య దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో మొదటిదని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ బీఎన్‌రావు అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. వ్యవసాయ ఉత్పత్తి పెంపు, గ్రామీణ పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, యువతకు సాంకేతిక నైపుణ్యత శిక్షణ, ఆత్మనిర్భరతకు సహకారం అందించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో పారిశ్రామిక రంగం అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన, ప్రజలకు మెరుగైన విద్య, ఆరోగ్య సేవలు అందించడం ద్వారా నిరుద్యోగాన్ని తగ్గించవచ్చన్నారు. డాక్టర్ కిషన్ మాట్లాడుతూ, సామాజిక స్పృహ ఉన్న మేధావి డాక్టర్ బీఎన్‌రావు లాంటి వారిని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపిస్తే సమాజానికి ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. సమావేశంలో సీనియర్ ఫీజిషియన్ వైద్యులు విజయమోహన్‌రెడ్డి, పొలాస రాంకిరణ్, వెంకటేశ్వర్‌రావు, సురేశ్‌గౌడ్, ప్రియాంకరావు, మురళీధర్‌రావు, శ్రీవాణి, గణేశ్, భాస్కర్, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం: మేయర్

కరీంనగర్‌లో అమృత్ పథకంలో చేపట్టిన పనులను పరిశీలిస్తున్న మేయర్ యాదగిరి సునీల్ రావు

కార్పొరేషన్, డిసెంబర్ 13: నగరంలోని విలీన గ్రామాలు, శివారు ప్రాంతాల డివిజన్ల ప్రజల తాగునీటి సమస్యకు అమృత్ 2.0 పథకం ద్వారా త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. శుక్రవారం అమృత్ 2.0 పథకంలో చేపట్టిన మంచినీటి సరఫరా అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, నగరపాలక సంస్థ వాటా నిధులు మొత్తం రూ.147 కోట్లతో అమృత్ 2.0 పథకం కింద పనులు చేపడుతున్నామని తెలిపారు. ఆయా పనులు పూర్తయితే విలీన, శివారు డివిజన్ల ప్రజల తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షరిఫొద్దిన్, ఇఫ్రాతెహరిన్ ఆఫీనా ఇంజినీరింగ్ అధికారులు, ఏజెన్సీ కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

ఫిల్టర్ బెడ్ పరిశీలన

నగరంలోని ఫిల్టర్‌బెడ్‌ను మేయర్ యాదగిరి సునీల్‌రావు పరిశీలించారు. 34, 14 ఎంఎల్‌డీ కెపాసిటీ కలిగిన ఫిల్టర్ బెడ్లు, 350 హెచ్‌పీ, 150 హెచ్‌పీ మోటరు పంపులు, నూతనంగా వినియోగంలోకి తెచ్చిన 350 హెచ్‌పీ మోటర్ పంపు పనితీరును పరిశీలించి, ప్యానల్ బోర్డు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నగరంలోని లోలెవల్, హైలెవల్‌లో మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఫిల్టర్ బెడ్ సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యం

తిమ్మాపూర్ రూరల్, డిసెంబర్ 13: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మంజూరైన అంబులెన్స్ వాహనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే పచ్చజెండా ఊపి ప్రారంభించారు. 24 గంటలు అంబులెన్స్ అందుబాటులో ఉంటుందని, వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డా.వెంకటరమణ, వైద్యులు అరుణ, కిరణ్, సాహితి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు, ఎస్.కొండల్ రావు, కుంట రాజేందర్ రెడ్డి, అంబులెన్స్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

శంకరపట్నం/ మానకొండూర్, డిసెంబర్ 13: శంకరపట్నం మండల కేంద్రంలోని రైతు వేదిక మందిరంలో 55 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ మల్లేశం, ఎంపీడీవో కృష్ణ భాస్కర్, గిర్దావర్ బాలకిషన్, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. అలాగే మానకొండూర్ రైతు వేదికలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో వరలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలు, నాయకులు నందగిరి రవి, తాళ్లపెల్లి సంపత్‌గౌడ్, కోంద్ర శంకర్, తాళ్లపెల్లి నరేశ్‌గౌడ్, కొత్తకొండ శంకర్ పాల్గొన్నారు.

నేడు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వీణవంక, డిసెంబర్ 13: మండల కేంద్రంలో శనివారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తారని, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మురుగు నీరు చెరువులోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 13: పట్టణ శివారులోని గుండ్ల చెరువు నీరు మురుగునీటితో కలుషితం అవుతున్నదని పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్ శుక్రవారం మురుగునీరు వెళ్లే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో పలు విషయాలపై చర్చించారు. నీరు కలుషితం కాకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేశ్ బాబు, తహసీల్దార్ కే కనకయ్య, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఆర్ఐ శేఖర్ తదితరులున్నారు.

ఆర్టీసీ బస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఈడీ

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 13: హుజూరాబాద్ ఆర్టీసీ బస్ స్టేషన్‌ను శుక్రవారం ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుద్రుషా ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్ నిర్వహణ, ప్రయాణికుల కోసం కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట లా ఆఫీసర్ ఈ కృష్ణ, బస్ స్టేషన్ మేనేజర్, ఆర్టీసీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

రేవంత్ దిష్టిబొమ్మ దహనం

విద్యానగర్, డిసెంబర్ 13 : భూ నిర్వాసిత లగచర్ల రైతు హీర్యా నాయక్‌కు బేడీలు వేసినందుకు నిరసనగా శుక్రవారం నగరంలోని కమాన్ వద్ద బీజేపీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు సీఎం రేవంత్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, తక్షణం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లగిచెర్ల రైతులపై పెట్టిన కేసులను వెనక్కి తీసుకోవాలని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నాంపల్లి శ్రీనివాస్, రెండో టౌన్ కన్వీనర్ గుంజేటి శివకుమార్, జోనల్ కన్వీనర్లు అవుదుర్తి శ్రీనివాస్, పురం హరిశంకర్, తణుకు సాయి కృష్ణా, సెంట్రల్ జోన్ కోకన్వీనర్ కలికోట మోహన్, మాచర్ల కోటేశ్, ఈస్ట్ జోన్ కో కన్వీనర్లు పోరెడ్డి శ్రీధర్ రెడ్డి, మాసం గణేశ్, లడ్డు ముందాడా, కొలిపాక శ్రీనివాస్, తోట సతీశ్, గుర్రం సమరసింహారెడ్డి, గుండె వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

యాదవ విద్యావంతుల వేదిక కన్వీనర్, కో-కన్వీనర్ నియామకం

విద్యానగర్, డిసెంబర్ 13 : యాదవ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్‌గా ఆసర రాజయ్య యాదవ్, కో-కన్వీనర్‌గా బోయిని పోచమల్లయ్య యాదవ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ నియామకానికి కృషి చేసిన జిల్లా, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

విద్యానగర్, డిసెంబర్ 13 : కరీంనగర్‌లో రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ట్రాఫిక్ సీఐ కరీం కోరారు. కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో తయారు చేయించిన 50 ట్రాఫిక్ బారికేడ్లను శుక్రవారం హాస్పిటల్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నగరంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం 50 బారికేడ్లు అందజేసిన మెడికవర్ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో హాస్పిటల్ మార్కెటింగ్ హెడ్ కోట కర్ణాకర్, అబ్దుల్ వకీల్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణకార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణచౌక్, డిసెంబర్ 13: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకులు శుక్రవారం డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న మాట్లాడుతూ, ఆన్‌లైన్ సర్వీస్‌లు మూడు నెలలుగా పని చేయడం లేదని, క్లెయిమ్స్ చెల్లింపులు నిలిచిపోవడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ధర్నాలో నాయకులు తిరుపతి, లక్ష్మణ్, రాములు, అంజయ్య పాల్గొన్నారు.

'క్రీడా ప్రాంగణం తొలగింపునకు కుట్ర'

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 13: గత ప్రభుత్వ హయాంలో లలితాపూర్‌లో గ్రామ యువకులు, గ్రామస్తుల కోసం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాన్ని తొలగించే కుట్ర జరుగుతున్నదని గ్రామ మాజీ సర్పంచ్ మర్రి కొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, క్రీడా ప్రాంగణంలో మట్టి పోయడంపై పంచాయతీ కార్యదర్శి జీవితను అడుగగా, నర్సరీ పనులు చేస్తున్నట్లు తెలిపారని చెప్పారు. ఈ విషయాన్ని ఆయన ఎంపీడీవో వరలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె ఎంపీవో కిరణ్ కుమార్‌తో కలిసి క్రీడా ప్రాంగణం పరిసరాలను పరిశీలించారు. గ్రామస్తులు సైతం అక్కడికి చేరుకొని క్రీడా ప్రాంగణాన్ని తొలగించొద్దని విన్నవించారు. దీంతో తాత్కాలికంగా పనులను ఆపివేయాలని ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

84 ఏళ్ల వృద్ధురాలికి బైపాస్ సర్జరీ

- అపోలో రీచ్‌లో కార్డియాక్ వైద్య సేవల్లో కొత్త దశ ఆవిష్కరణ
- ప్రముఖ కన్సల్టెంట్ కార్డియాతోరాసిక్ వ్యాస్కులర్ సర్జన్ డాక్టర్ సంతోష్ కుమార్ దంగేటి

భూమక్క

విద్యానగర్, డిసెంబర్ 13 : కరీంనగర్ అపోలో రీచ్ హాస్పిటల్‌లో ఒక అరుదైన వైద్య చరిత్ర సృష్టించారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రంగపేటకు చెందిన 84 ఏళ్ల భూమక్కకు విజయవంతంగా బైపాస్ సర్జరీ నిర్వహించి, ఆరోగ్యంగా జీవించడానికి మరో అవకాశం అందించారు. అపోలో రీచ్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ కార్డియాక్ సర్జన్ డాక్టర్ సంతోష్ కుమార్, అనస్థీషియా నిపుణుడు డాక్టర్ దామోదర్ వివరాలు వెల్లడించారు. సాధారణంగా 80 సంవత్సరాల దాటిన వయసు వారికి బైపాస్ సర్జరీ రిస్క్‌గా మారుతుందని, వారికి వెంటిలేటర్ అవసరంతో పాటు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుందన్నారు. కానీ భూమక్క యాక్టివ్‌గా, ఆరోగ్యంగా ఉండడంతో విజయవంతంగా బైపాస్ సర్జరీ చేయగలిగామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఈ సర్జరీ పూర్తిగా ఉచితంగా నిర్వహించినట్లు తెలిపారు. ఎంఐసిఎస్ (మినిమిల్లీ ఇన్వాసివ్ కార్డియాక్ సర్జరీ) వంటి సాంకేతికతలు వృద్ధులకు కొత్త ఆశలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. చిన్నకోత ద్వారా సర్జరీ చేస్తామన్నారు. తక్కువనొప్పి, తక్కువ సమయం పడుతుందన్నారు. ఎముకల కట్ ఉండదని ఇన్ఫెక్షన్, రక్తస్రావం ఉండదన్నారు. దీంతో వేగవంతంగా పేషెంట్ రికవరీ అవుతారని పేర్కొన్నారు. భూమక్క మనుమడు పవన్ కుమార్ మాట్లాడుతూ, తమ నానమ్మకు పునర్జన్మ నిచ్చిన డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ దామోదర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. హాస్పిటల్ పరిపాలకుడు డాక్టర్ నాగ సతీశ్ మాట్లాడుతూ, గుండె వైద్యానికి సంబంధించి ఉత్తర తెలంగాణలో అగ్రగామి అయిన అపోలో రీచ్ హాస్పిటల్ కాలం, సాంకేతికతతో పోటీపడుతూ ఎప్పటికప్పుడు అత్యున్నత వైద్య విధానాలు అందుబాటులోకి తీసుకువస్తున్నదని తెలిపారు.

యువకుడి అదృశ్యం

శంకరపట్నం, డిసెంబర్ 13: మెట్‌పల్లి గ్రామానికి చెందిన క్యాదాసి సంపత్ అనే యువకుడు అదృశ్యం అయినట్లు పోలీసులు తెలిపారు. సంపత్ నవంబర్ 11న సాయంత్రం ఇంటి నుంచి మోటార్ బైక్‌పై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, చుట్టు పక్కల బంధువులు, స్నేహితుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. సంపత్ భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు మానేరు విద్యార్థులు

కొత్తపల్లి, డిసెంబర్ 13 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నేటి నుంచి మూడు రోజుల పాటు జరుగనున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషుల, మహిళల బేస్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు అక్షయ్ కార్తీక్, విష్ణువర్ధన్, ప్రణయ్‌కుమార్, నిషాంత్‌రెడ్డి ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ జి. సరితారెడ్డి తదితరులు అభినందించారు.

మెప్మా సిబ్బంది ముందస్తు అరెస్ట్

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 13: మెప్మా ఉద్యోగుల మహా